

# వశీకరణ మంత్రం

ఆ షాపు మెట్లు దిగుతుంటే ఎవరో ఢీ కొట్టినంత పని చేశారు నన్ను. కొంత పరాగ్గా ఉన్నానేమో చేతిలోని పాకెట్ కింద పడిపోయింది. నన్ను నేను తమాయించుకోగలిగాను కాబట్టి నిలబడి ఉన్నాను ఇంకా, లేకపోతే ఈ మెట్ల మీంచి దొర్లి, రోడ్డుమీద పడి ఉండేదాన్ని.

పాకెట్ అందుకుంటూ, కోపాన్ని దిగమింగుకొంటూ నన్ను ఢీకొట్టిన వ్యక్తికేసి చూశాను. ఇంకేమీ చేయలేని నా నాగరితకను తిట్టుకొంటూ.

ఆశ్చర్యం... నన్ను ఢీకొట్టిన వ్యక్తి... సుధ!

"నువ్వా!" ఇద్దరి నోటా ఒకే మాట.

నా కోపమూ, సుధ ముఖంలో నేను ఉందనుకొన్న 'సారీ' రెండూ పోయాయి.

"రా!" అంటూ సుధ నన్ను షాపులోకి లాక్కెళ్ళింది. ఒక గంట సేపు నాతో అదీ ఇదీ మాట్లాడుతూనే ఒక్క చీర సెలక్ట్‌చేసింది. ఆడపడుచు పుట్టిన రోజట మర్నాడు. అందుకోసమాచీర!

నేను వచ్చిన సంగతి అడిగితే నవ్వుతూ తప్పించేశాను ఆ ప్రసక్తి.

"ఇంటికెళ్ళాలి!" అంటూ ఉన్నా వినిపించుకోకుండా సుధ నన్ను బలవంతం చేసి వాళ్ళ ఇంటికి లాక్కొచ్చింది.

పెద్దఇల్లు - సొంతమట! నాకు అసూయ కలిగింది. నా క్లాస్‌మేట్ సుధ. కలిసి చదువుకొన్నాం... సుధకు పెళ్ళయింది. సొంత ఇల్లుంది! అసూయకు నా వరకూ ఆ రెండు కారణాలు చాలు!!

వెడల్పు మెట్లు రెండు ఎక్కి గదిలోకి వచ్చాం. చిన్న గది. ఆ తర్వాత గది మరీ పెద్దదిగా ఉంది. లోపల గదిలోకి అడుగుపెడుతూనే ఉలికిపడ్డాను.. ఎదురుగా పుస్తకాల షెల్ఫ్‌లో ఉన్న ఫోటో ఫ్రేమ్‌లోంచి సుధది, ఆమె భర్తది ఫోటోలు తొంగి చూస్తున్నాయి.

అంటే... రాజారాం సుధ భర్తా?... ఆ సంగతి అడగనక్కర్లేదు. భర్త కాకపోతే అంత పెద్ద ఫోటో ఇంటి మధ్య ఉండదు.

అన్నీ సరిగ్గా జరిగి ఉండి, నా గీత తిన్నగా ఉండి ఉంటే ఆ ఫోటోలో రాజారాం పక్కన నా ఫోటో ఉండి ఉండాల్సింది. ఈ ఇల్లు 'నా' ఇల్లు అయి ఉండాల్సింది - ఇప్పుడు దీన్ని నేను సుధకు చూపిస్తూ ఉండాల్సింది!!

కానీ... నుదుటిమీది గీత వేరు. నా స్థానాన్ని సుధ ఆక్రమించింది. నేను యజమానురాల్ని కావాల్సిన ఇంట్లో ఇప్పుడు అతిథిగా ఉన్నాను.

మనసంతా పాడయిపోయింది. సుధ ఇంకా ఏవేవో చూపించింది. చెప్పింది. బహుశా టేప్ రికార్డరో, రికార్డ్ ప్లేయరో, రేడియోగ్రామో, టెలివిజనో, ఫ్రిజో, కూలరో - ఏమో - ఏవేవో చూపించే ఉంటుంది. నేను అవేవీ చూడలేదు. నా చూపులన్నీ గతంలో ఆ రోజు దగ్గర ఆగిపోయాయి. శరీరం యాంత్రికంగా సుధను ఫాలో అవుతోందే తప్ప మనసు ఆ రోజు దగ్గర నుంచి కదలనంటోంది.

ఆ రోజు...

నా పెళ్ళి చూపుల రోజు ఏడో, ఎనిమిదో... సరిగ్గా లెక్క వేసే స్థితి దాటిపోయాను. ఏదో ఇంట్లో జనం చెప్పినట్లు, ఆ వ్యక్తి ముందు కూచుని లేవటం, అర్థం పర్థం లేని ఆ ప్రశ్నలకు వాళ్ళకు అంతకు మునుపే తెలిసిన జవాబులు చెప్పటం నాకు బాగా అలవాటు అయిపోయింది. మనసు ఇలాంటి చోట్ల మొరాయించటం మానుకొంది. సరైన కారణం చెప్పకుండా ఆడదాన్ని అవమానిస్తున్న ఈ పెళ్ళిచూపులంటే గౌరవం పోయింది. కానీ ఎదురు తిరిగేంత ధైర్యం లేదు కాబట్టి, ఏమీ చేయలేనన్న వేదాంతం అబ్బేసింది కాబట్టి, మళ్ళీ తయారయ్యాను సాయంత్రం వేళకు.

ఇంకో గంటకో, గంటన్నరకో రావాల్సి ఉంది పెళ్ళి చూపుల జనం.

అప్పుడొచ్చాడు బడాసాహెబ్. బడా సాహెబ్ అసలు పేరేమిటో నాకు తెలీదు. అందరూ బడాసాహెబ్ అంటారు... ఆజానుబాహు విగ్రహం. బహుశా అందుకే వచ్చిందేమో ఆ పేరు. తేలు మంత్రం, పాము మంత్రం వేస్తాడు. ఆకులు, పసర్లు, అంటూ నాటు వైద్యాలు చేస్తాడు. ఎవరికైనా తగ్గిందో, లేదో తెలీదు కానీ బడాసాహెబ్ జీవితం మాత్రం దానిమీదే గడిచిపోతోంది. ఆ సంగతిలో మటుకు అబద్ధం లేదు.

బడాసాహెబ్ రావటంతోనే గదిలోకి వచ్చాడు. అమ్మ అప్పటికే తాంబూలం పళ్ళెంలో అన్నీ సిద్ధం చేస్తోంది.

"అమ్మాయిగారికి మళ్ళీ పెళ్ళిచూపులాండి?" అడిగాడు బడాసాహెబ్.

"అవు" నంది అమ్మ.

క్షణం నాకేసి చూసి "నువ్వు ఆ గదిలోకి పో, అమ్మా" అని నన్ను పక్క గదిలోకి పంపేశాడు. ఆ తర్వాత నా చెవులన్నీ ఆ గదినే అంటి పెట్టుకొని ఉన్నాయి.. "ఇంత చెప్పినా మీరేమీ వినటం లేదమ్మా - నా మాట వినండి. అన్ని సంబంధాలూ ఎందుకు తప్పిపోతున్నాయని? అమ్మాయికి కాలొంకరా, చెయ్యి వంకరా! - ఈ ఒక్కసారి నా మాట వినండి. ఇంత పసరు పిండి ఇస్తా... ఆ కాఫీ నీళ్ళలో కలిపి ఇవ్వండి చాలు, అబ్బాయి మీ అమ్మాయికి దాసోహం అనకపోతే నన్ను అడగండి" అంటున్నాడు బడాసాహెబ్.

ఉలికిపడ్డాను.. వశీకరణం! పేరు విన్నానే కానీ అదెప్పుడూ చూడలేదు. దానికి సరైన మందు ఇస్తానంటున్నాడు బడాసాహెబ్ - ఒకటా, రెండా - ఎన్ని పెళ్ళిచూపులు వేస్ట్ అయిపోయాయి! నిజానికి బడాసాహెబ్ అన్నట్లు నాకేమైనా చెయ్యి వంకరా, కాలు వంకరా ! పోనీ ఈ ఒక్కసారి బడాసాహెబ్ చెప్పినట్లు చేస్తే..

"వద్దు, సాయబూ!.. అయ్యగారొప్పుకోరు!" అంటోంది అమ్మ.

అమ్మ ఒప్పుకొంటే బాగుండును అనిపించింది. ఈ చెర వీడిపోతుంది. ఒక్కసారి ఈ పనిచేస్తే ఇంక ఈ బాధ అనుభవించనక్కరలేదు.

బడాసాహెబ్ మళ్ళీ కొంచెం నచ్చ చెప్పాడు. "ఏమైనా వికటిస్తే కష్టం, సాయబూ!" అంటోంది అమ్మ, అంటే అమ్మ ఒక్కడుగు ఒప్పుకొన్నట్లే లెక్క. 'వూ' అనేస్తే బాగుండును అనుకున్నాను మనసులోనే.

నిజానికి చదువుకున్న దాన్ని, ఇలాంటి మంత్రాలకు చింతకాయలు రాలతాయని అనుకోను. కానీ ఏదో ఆశ. జీవితంలో గెలవాలనే ఆశే తప్ప దాని ముందు ఏ రీజనింగ్ నిలబడదు. అందుకే నాకు బడాసాహెబ్ పెద్దదిక్కులా కనిపించాడు.

ఏ మొండి ధైర్యం నాలో ప్రవేశించిందో తెలీదు. బడాసాహెబ్ ముందుకు వచ్చి అన్నాను - "అమ్మ సంగతి విడిచి పెట్టు, సాయబూ... వెళ్ళి ఆ పసరు పట్రా! నేను చేస్తాను!!"

బడాసాహెబ్ నివ్వెరపోయాడు.

అమ్మ ఆశ్చర్యపోయింది - నేను ఇలాంటి పనికి ఒప్పుకుంటానని కలలో సైతం అమ్మ ఊహించి ఉండదు!

"నాన్నకు నేను నచ్చచెపుతాలే" అని అమ్మతో చెప్పి సాహెబ్‌ను వెంటనే వెళ్ళి ఆ పసరు తెమ్మన్నాను... "కాఫీరంగు మారకూడదు, సాయబూ, ఏ వెగటించటమూ ఉండకూడదు. జాగ్రత్త" అని హెచ్చరించి పంపాను.

బడాసాహెబ్ వచ్చేలోగా నాన్న వచ్చారు. నాన్నకు అంతా నేనే చెప్పాను. కళ్ళింతలు చేసుకుని ఆశ్చర్యపోతూ చూశారే తప్ప ఏమనీ అనలేదు. బహుశా ఆయనకూ నా పెళ్ళి పట్ల నమ్మకం సడలి, బడాసాహెబ్‌పట్ల, అతని మంత్రతంత్రాలు, పసర్ల పట్ల నమ్మకం పెరిగిందేమో!

బడాసాహెబ్ వచ్చి ఏదో పసరు ఇచ్చాడు - చిన్న సెంటు సీసాతో, వాసన లేదు. కాఫీలో కలిపితే రంగు ఉండదు అన్నాడు. రుచి తేడా ఉండదన్నాడు. అయినా ముందు జాగ్రత్తకు ఒక కప్పు కాఫీ కలిపి దాంట్లో ఇదో రెండు చుక్కలు వేసి పరీక్ష చేసుకొని, దొరికే అవకాశం లేదని నిర్ణయించుకొని కాఫీ అవతల పారబోసేశాను.

"సాయిబూ, ఏమైనా వికటిస్తే, నిన్ను ప్రాణాలతో బ్రతకనియ్యను!" అన్నారు నాన్న.

"ఏమి జరగదయ్యా! నాది భరోసా! అమ్మాయి పెళ్ళికి మీరు పప్పన్నం సిద్ధం చేయించండి. నా మాట నమ్మండి!" అంటూ బడాసాహెబ్ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత గంటకు పెళ్ళిచూపుల వాళ్ళొచ్చారు. జాగ్రత్తగా కాఫీలో కలిపి నేనే 'పెళ్ళికొడుక్కు' స్వయంగా అందించాను. అతను వశం అవాల్సింది నాకే.

కాఫీ తాగాక అతని ప్రవర్తన మారిపోతుందనీ, అతని చూపుల్లో అదేదో వస్తుందని, నాకు, నా అందాలకు దాసోహం అనేసాడని ఏవేవో అనుకున్నాను. కానీ ఏమీ జరగలేదు.

కాఫీలు తాగేసి మామూలుగా అంత క్రితం వాళ్లలాగానే వీళ్లూ లేచి "తర్వాత కబురు చేస్తా లెండి" అంటూ వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రం బడాసాహెబ్‌ను పిలిపించి నాన్న తిట్టిన తిట్టు తిట్టకుండా గంటసేపు తిట్టారు. ఇప్పుడిలా జరిగింది - రేపటికి అది ఇంకా వికటిస్తుందేమోనన్న భయం నాన్నది. అదేమీ జరగదన్నాడు సాహెబ్. తను ఇచ్చిన పసరులో ఏ దోషమూ లేదన్నారు.

నా ఆశలన్నీ చచ్చిపోయాయి.

ఆరు రోజుల తర్వాత ఉత్తరం వచ్చింది - ' అమ్మాయి నచ్చలేదు, క్షమించండి' అంటూ. ఆ ఉత్తరం వచ్చిన ఆ రోజున బడాసాహెబ్‌ను నేను కూడా తిట్టాను.. ఆఖరికి ఆ పసరు మంచి ఎలాగూ చెయ్యలేదు, ఈ సారి చెడు అయినా చేసి ఉంటే బాగుండేది అనుకున్నాను. పెళ్ళి కోసం ఒక కన్నెపిల్ల - చదువుకున్నది, అందమైనది - పడే అవస్థలు ప్రపంచానికి తెలిసి ఉండేవి.

అప్పుడు నన్ను తప్పించుకొన్న పెళ్ళికొడుకు ఇదిగో - ఇక్కడ ఈ ఫోటో ఫ్రేమ్‌లో బంధింపబడి ఉన్నాడు. సుధ పక్కన.

నన్ను తప్పించుకుని, బడాసాహెబ్ పసరు సైతం పసలేనిదిగా చేసేసిన రాజారాం ఇతను. ఇతన్ని సుధ ఎలా చేసుకోగలిగింది! బహుశా సుధ కూడా ఏదో మంత్రమో వేసి ఉంటుంది. కాకపోతే ఏ జలంధర్ ఉంగరమో... నా పిచ్చితనానికి నాకే నవ్వు వచ్చింది.

కానీ మనసు పొరల్లోంచి ఏదో తెలీని కోరిక. రాజారాంను సుధ ఎలా వశపర్చుకొందనే సస్పెన్స్!!

అడిగేశాను. డైరెక్ట్‌గా అడిగే అవకాశం లేదు కనుక కొంచెం రంగులు పులిమి ప్రశ్న బయట పెట్టాను - "మీ పెళ్ళికి రాలేదే నేను - పెళ్ళి విశేషాలు చెప్పు! ఎలా జరిగింది? ఎక్కడ జరిగింది? పెళ్ళి ఎలా కుదిరింది? ఎవరు కుదిర్చారు? ఆయన ఏం చేస్తుంటారు?" అని.

సుధ అసలు పాయింట్‌లోకి వచ్చింది. "పెళ్ళికుదరటం ఒక్కటే తమాషా అనుకో! మిగిలినదంతా మామూలే! అదే రోజు సాయంత్రం వాళ్ళు ఇంకో అమ్మాయిని చూశారట. ఆ అమ్మాయి నచ్చలేదు. అందుకే పనిలో పనిగా అంటూ నన్ను చూట్టానికి వచ్చారు! చీకటి పడిపోయింది. లైట్లు పోయాయి. అరగంట సేపు ఉండి, ఏదో ఒకటి, పెట్రోమాక్స్ లైటులోనైనా సరే చూపించండి అన్నారు వాళ్ళు. సరే, పెట్రోమాక్స్ దీపాల కాంతిలో చూశారు నన్ను! చూడటం ఏమిటి, వూ అనటం ఏమిటి, తాంబూలాలు పుచ్చుకోవటం ఏమిటి అన్నీ జరిగిపోయాయి. అప్పుడొచ్చాయి లైట్లు!!" అంది సుధ, గుక్క తిప్పుకోవటానికి ఆగుతూ.

ఉలిక్కిపడ్డాను నేను - పట్టపగలు సూర్యకాంతిలో నన్ను చూసి వద్దన్న రాజారాం... పెట్రోమాక్స్ దీపాల కాంతిలో ఈ నల్ల సిబ్బిని ఎలా చేసుకున్నాడు! అదీ ఏ మంత్రం లేకుండానూ!!

"మా నాన్నగారు వాళ్ళు తాంబులాలలోనే కట్న కానుకాలూ ఇచ్చేశారు. అరవై వేల కట్నం, రెండున్నర ఎకరాల పొలం, ఇరవై తులాల బంగారం, పదివేల రూపాయల కాష్ నా పేరిట - ఇద్దరాడపడుచులకూ చెరో వెయ్యిన్నూటపదహార్ల లాంఛనాలు."

ఇంక వినటం మానేసాను.

- అర్థం అయిపోయింది. బడాసాహెబ్ పసరు ఎందుకు పని చేయలేదో, పెట్రోమాక్స్ దీపాల కాంతిలో సుధ ఎందుకు అందంగా కనపడిందో అంతా తెలిసిపోయింది నాకు!!

గౌతమునికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయం అయిందట - నాకు ఇక్కడ!!

లేచాను - సాయంత్రం వచ్చే పెళ్ళిచూపుల వాళ్ళకు ముందుగా మేం ఇవ్వదలిచిన కట్న కానుకల గురించి చెప్పమని నాన్నగారికి చెప్పాలి!! ఈ సారి ఈ మంత్రం వేస్తే ఎలాంటి పెళ్ళికొడుకైనా సరే, నాకు వశం అయిపోతాడు. బడాసాహెబ్ పసరుకన్నా పవర్‌ఫుల్ వశీకరణ మంత్రం ఏమిటో ఇప్పుడు నాకు బాగా తెలుసు!!

*- ఆంధ్రప్రభ, సచిత్రవారపత్రిక, 02.09.1981*